క్లుప్తంగా

ఘనంగా వీరభద్రుని సంబరం

అంబాజీపేట: వీరభద్రుని సంబరాన్ని అంబాజీపేటలో పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ప్రతిమలను శిరస్సుపై ఉంచి బాజా భజంత్రీలతో పురవీధుల్లో ఊరేగించారు. మాచవరంలో ఉన్న దుర్గా శ్రీరామ్ ఘాట్ కౌశిక వద్ద పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా వీరభద్రుని సంబరాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటమే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని సర్పంచ్ మట్టపర్తి నాగరాజు అన్నారు. పసుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముక్కామల వైద్యాధికారి జి.రమ్యశైలజ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి రోగి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బీపీ, సుగర్, కంటికి, జనరల్ రోగాలకు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ఎ.రాధా నరసింహం, హెచ్‌వీ కుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, పాల్గొన్నారు.

వైభవంగా విక్రమ భట్టీశ్వర స్వామి కల్యాణం

ఆలమూరు: పురాణ ప్రసిద్ధి గాంచిన పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలో ఆలయ పురోహితులు కాళ్లకూరి సూరిపండు ఆధ్వర్యంలో వేద పండితులు మంగళవారం రాత్రి ఈ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయానికి అలంకరించిన విద్యుత్ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు

అంబాజీపేట: ఈనెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక స్త్రీల ఆసుపత్రిలో మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి సీఓ ఎన్.హెవార్డురాజ్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒక రూపాయికి ఓపీ రిజిస్ట్రేషన్ మొదటి 50 మందికి నిర్వహిస్తామన్నారు. కంటి ఆసుపత్రిలో మహిళలకు రాయితీపై వైద్య సేవలు అందిస్తామన్నారు. దంత విభాగం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా వైద్య ఖర్చులలో 25 శాతం తగ్గిస్తామన్నారు. ఎముక సాంద్రత పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఇవే కాకుండా అన్నివేళలా ఇతర అత్యాధునిక వైద్య సేవలు అందిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెవార్డురాజ్ కోరారు.

ఎంపీడీవోగా సత్యనారాయణ

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవోగా పీవీ సత్యనారాయణ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా గణపవరం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఎంపీడీవో బడుగు మంగాదేవి, ఏపీవో నాగప్రసాద్, పరిషత్ ఏవో సోమేశ్వరీలు ఆయనను సత్కరించి, అభినందనలు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.20,232 విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అనంతపురం వాస్తవ్యుడు గాడంశెట్టి సత్యనారాయణ రూ.10,116, దూపకుంట్ల నగేష్‌లు రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ వేదపండితులకు అందజేశారు. దాతలను వేదపండితులు వేదాశీర్వచనం పలికి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు. దాతలను ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు అభినందించారు.

కుల రాజకీయాలు చేస్తున్న టీడీపీ

కొత్తపేట: టీడీపీ కుల రాజకీయాలు చేస్తుందని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్‌నారాయణ (జేపీ) విమర్శించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ 50 సంవత్సరాలు దాటిన బీసీలకు పింఛన్ ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్ని కులాల్లోనూ పేదలు ఉండగా ఒక్క బీసీలకు మాత్రమే 50 సంవత్సరాలకు పింఛన్ ఇవ్వడం ద్వారా కులాలను విభజించి, వారి మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నట్టు ఉందని పేర్కొన్నారు. 2019లో ప్రజలు చంద్రబాబు కుల రాజకీయాలను తిప్పికొట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా 'రుద్రరాజు'

మలికిపురం: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా లక్కవరం గ్రామానికి చెందిన రుద్రరాజు గోపాలకృష్ణంరాజు నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన వివరించారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకం మేరకు పని చేస్తానని రుద్రరాజు అన్నారు.

జగన్ ప్రభుత్వంలో పేదలు లక్షాధికారులు

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- మహిళలకు రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత



కొత్తపేటలో మహిళలకు స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



ఖండ్రిగలో కమ్యూనిటీ హాలు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలు లక్షాధికారులు అయ్యారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలో 3,961 మంది మహిళలకు ఇళ్ల స్థలాలు కేటాయించగా వారిలో ఇప్పటి వరకూ 2,831 మందికి రిజిస్ట్రేషన్ చేసి ఆ పత్రాలను బుధవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఆర్డీవో జీవీవీ సత్యనారాయణతో కలసి పంపిణీ చేశారు. స్థానిక ఎంపీపీ కార్యాలయ ఆవరణలోని జరిగిన సభకు ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఆర్డీవో సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సభలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేసి, వారికి ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చడం ద్వారా సమాజంలో వారికి గౌరవాన్ని కల్పించారన్నారు. ప్రభుత్వ భూములు లేకపోయినా, దేవదాయ శాఖ భూములు తీసుకోవడానికి అభ్యంతరాలు వచ్చినా జగన్ తన లక్ష్యాన్ని గాలికొదిలేయలేదని, ఎకరానికి రూ.60 లక్షలు వరకు వెచ్చించి మరీ కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా రిజిస్ట్రేషన్ చేయించి దానిపై సర్వ హక్కులు కల్పించారన్నారు. ఇది ప్రతి అక్కచెల్లెమ్మకు జగనన్న ఇచ్చిన కానుక అని అన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతూ అందరూ సమాజంలో గౌరవంగా బతుకుతున్నారని.. అలాంటప్పుడు చంద్రబాబు లాంటి టక్కరులు అవసరమా? అని అన్నారు. మళ్లీ మరిన్ని పథకాలతో సీఎం జగన్ రానున్నారని, మీ అందరూ ఆయనకు మద్దతు పలికి ఫ్యాన్ గుర్తుపై 2 బటన్లు నొక్కి జగన్ రుణం తీర్చుకోవాలని జగ్గిరెడ్డి కోరారు. సభలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్ రెడ్డి చంటి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు నేలపూడి భీమరాజు, ముళ్ల జనార్దనరావు, జిల్లా పార్టీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలుపుకున్నా.. ఐక్యంగా కలసిరండి

కొత్తపేట: మీకిచ్చిన మాట ప్రకారం మీ గ్రామంలో ప్రత్యేకంగా బేడ బుడ్గ జంగం కమ్యూనిటీ హాలు నిర్మించాం.. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశాం.. దానికి ప్రతిగా వచ్చే ఎన్నికల్లో మీ గ్రామం అంతా ఒక్క మాటగా వైఎస్సార్ సీపీ విజయానికి కలసి రావాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఖండ్రిగ బేడ బుడ్గజంగాల పేటలో ఎస్‌డీఎఫ్, మండల పరిషత్, జెడ్పీ నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును బుధవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ దూనబోయిన నవదీప అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామ సంఘ పెద్దలు కళ్యాణం శ్రీను, ఉప్పు సత్యం, ముగ్గు పోచయ్య మాట్లాడుతూ మా గ్రామానికి కల్యాణమండపం చిరకాల కోరికని, దీనికి గతంలో చాలా మంది నాయకులు హామీలు ఇచ్చి గాలికొదిలేశారన్నారు. కానీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాత్రం మీకు మాటిస్తున్నాను.. నిర్మించి తీరుతానన్నారు. అన్నట్టుగానే మా కలను నెరేర్చారు. అంతేకాదు స్కూలు భవనం, సీసీ రోడ్లు, పాంచాలరేవు నిర్మించి, మా గ్రామం రూపురేఖలనే మార్చారని కృతజ్ఞతలు తెలియచేస్తూ, ఎప్పుడూ ఆయన వెన్నంటే ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి, ఎంతో శ్రమించి కమ్యూనిటీ హాలుతో పాటు సుమారు రూ.30 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఎంపీటీసీ పితాని లక్ష్మీతులసి, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 19 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్మాత పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణ రాజు) దంపతులు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 8 నుంచి గోవింద మాలధారణ దీక్ష జరుగుతుందన్నారు. గోవింద మాలధారణ చేపట్టే భక్తులు గోత్రనామాలతో ఆలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. గోవింద మాల ధరించే భక్తులు పసుపు వస్త్రాలు ధరించి తులసిమాల, స్పటికమాల, విఘ్నేశ్వర సామగ్రి తీసుకుని రావాలన్నారు. మాలధారణ చేసిన భక్తులకు ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం ఆలయం వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు కార్యక్రమానికి భక్తులు విధిగా హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9848982878కు సంప్రదించాలని కోరారు.

ప్రజా సంక్షేమం వెల్లివిరుస్తోంది



మలికిపురంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమం వెల్లు విరుస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మలికిపురంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ అయిన సుమారు 250 ఇళ్ల స్థల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ రోజు జగన్ అందించిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంట్లోను ఉన్నాయన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ ఉండకూడదని భావించిన జగన్ ఆ దిశగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని అన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యాధులకూ ఆరోగ్యశ్రీని సులభతరం చేసిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. జగన్ సంక్షేమ పథకాలను ఈ రోజు దేశమంతా మోడల్‌గా తీసుకుంటున్నా గాని, రాష్ట్రంలో ప్రతిపక్షాలు కుట్రలతో విమర్శిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఉప సర్పంచ్ గుబ్బల బాబ్జి, గెడ్డం తులసీ భాస్కరరావు, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మి, మేడిద లక్ష్మి, కోళ్ల వేణుప్రసాద్, వీఆర్‌ఓలు హరి కిషన్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

పాశర్లపూడిలంకలో సురక్ష శిబిరం



పాశర్లపూడిలంక ఆరోగ్య సురక్ష శిబిరంలో వృద్ధురాలికి బీపీ చెక్ చేస్తున్న వైద్యులు

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం పాశర్లపూడిలంకలో జరిగింది. లూటుకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరం ద్వారా డాక్టర్లు డీవీ సత్యం, అనూష, రామకృష్ణ, నిఖిత 314 మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. వారికి మందులు అందజేశారు. పేద ప్రజలకు గ్రామ స్థాయిలోనే వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ శిబిరం ద్వారా బీపీ, సుగరు, బ్లడ్ టెస్ట్, తదితర పరీక్షలు చేశారు. స్థానిక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ చెరుకూరి పద్మావతి, స్థానిక పెద్దలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు సేవలందించారు.

నవాబుపేటలో..

ఆలమూరు: రాష్ట్రంలో అనారోగ్యంతో ఏ ఒక్కరూ ఆర్థికంగా అవస్థలు పడకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్) ప్రవేశ పెట్టారని కొత్తపేట డివిజనల్ వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని నవాబుపేటలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు జరిగింది. చొప్పెల్ల ప్రాథమిక వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవైద్య శిబిరంలో ప్రభుత్వ ప్రత్యేక వైద్యనిపుణులు జి.దుర్గా ప్రసాద్, మేఘ స్పందన విచ్చేసి సుమారు 258 మందికి వైద్య సేవలు అందించి వివిధ రకాల రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమం క్రింద నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి 76 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్ళు అందజేశారు.

నేదునూరులో..

అయినవిల్లి: ప్రతి పేదవాడికి తాము ఉంటున్న గ్రామాల్లోనే ప్రభుత్వం కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్యం అందిస్తుందని నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ అన్నారు. బుధవారం నేదునూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందజేశారు. అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యులు పి.సంతోష్, సమీరా, వెంకటేష్, ప్రియాంకలు 350 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. రోగులకు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ చేతుల మీదుగా ఉచిత మందుల కిట్ అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మోహన్‌కృష్ణ, పంచాయతీ కార్యదర్శి గిడుగు సూర్యనారాయణమూర్తి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు



మాచవరంలో రక్షిత మంచినీటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని దశలవారీగా అందించేందుకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం శివారు కామయ్యకోడులో రక్షిత మంచినీటి ప్రాజెక్ట్‌ను బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ.2.50 కోట్లతో రక్షిత మంచినీటి పథకం, వాటర్ ట్యాంకులను నిర్మించామన్నారు. మాచవరం గ్రామానికి అవసరమైన 20 లక్షల లీటర్ల నీటి సామర్థ్యానికి బదులు ప్రస్తుతానికి 1.20 లక్షల లీటర్ల నీటిని 4 వందల ఇళ్లకు సరఫరా చేస్తారన్నారు. దశలవారీగా గ్రామంలోని ప్రజలందరికీ మంచినీరు అందిస్తామన్నారు. మంచినీటి టాంకులు, జల్‌జీవన్ మిషన్ ద్వారా నిర్మించే పైప్‌లైన్ పనులు పూర్తి కాగానే మంచి నీటిసరఫరా అందరికీ అందిస్తామన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి, మండల ప్రత్యేక అధికారి బీవీ రమణ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ఎంపీటీసీ మట్టా పార్వతి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, కుసుమ శ్రీనివాస్, మట్టపర్తి హరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పెద్దపీట

రాజోలు: గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం వేగివారిపాలెంలో నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంక్‌తో పాటు పలు కాలనీల్లో నిర్మాణం పూర్తి చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని రీతిలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ పప్పొప్పుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ బయ్యా సునీత, గుబ్బల మనోహర్, చెన్నడం సర్పంచ్ బడుగు శ్రీనివాసరావు, కంచర్ల శేఖర్, రాపాక శ్రీను, బళ్ల శ్రీను, వై.వెంకట్, బళ్ల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

తాటాకు పాక దగ్ధం

ఆత్రేయపురం: మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన చిట్టూరి ఊదరాజు సప్లై కంపెనీ సామాన్లు ఉన్న పాక దగ్ధమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. పాకలో టాటా ఏసీ ఒకటి, మూడు జనరేటర్లు, మోపెడ్-1, టెంట్ బల్లలు పూర్తిగా దగ్ధమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడు సప్లై కంపెనీలో సామాన్లు అద్దెకు ఇచ్చి జీవనం సాగిస్తున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

రావులపాలెం: సచివాలయ పరిధిలోని ఉద్యోగులు గ్రామస్థాయిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ వివరాలను ఎప్పటికప్పుడు గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులకు వివరించడంతో ప్రజలకు సేవలు అందించాలని ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ బడ్జెట్ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత శాఖల వారీగా ప్రగతి వివరాలను అధికారులు వివరించగా బడ్జెట్ వివరాలను ప్రవేశపెట్టారు. 2024-25కు అన్ని పద్దులు కలుపుకుని ఆదాయం రూ.27 కోట్ల 1లక్ష 73,000గా నిర్ణయించారు. అలాగే అన్ని పద్దులు కలుపుకుని వ్యయం రూ.27 కోట్ల 2 వేల 900గా అంచనా వేశారు. దీంతో రూ.1,70,100 మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. సమావేశంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, తహసీల్దార్ డీవీవీఎస్ అశోక్‌వర్మ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లకు మీటర్లు వద్దు



అంబాజీపేట సమావేశంలో మాట్లాడుతున్న మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ప్రశాంత్

అంబాజీపేట: రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటు చేయవద్దంటూ తీర్మానం చేయాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయాలని ఎంపీటీసీలు పార్టీలకతీతంగా ఏకగ్రీవంగా కోరారు. అంబాజీపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఎంపీటీసీలు మాట్లాడుతూ ప్రస్తుత కష్టకాలంలో రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ అవగాహన సదస్సులు నిర్వహిస్తోందన్నారు, విద్యుత్ మీటర్లు నిర్మించవద్దంటూ మండల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసేలా పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. విద్యుత్ అధికారుల నుంచి పలు విషయాలు తెలుసుకుందామంటే విద్యుత్ అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడం ఎంతో శోచనీయమన్నారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు ఎక్కువగా హాజరు కాకపోవడంతో ఉన్నవారితోనే సమావేశాన్ని మమ అనిపించారు. తమ గ్రామానికి నాడు నేడు పథకం కింద మంజూరైన రూ.6 లక్షలతో ఏ మాత్రం నిర్మాణాలు పూర్తి కాలేదని వాటికి సమాధానం చెప్పాలని గంగలకుర్రు ఎంపీటీసీ నెల్లి ఏడుకొండలు డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మె కాలంలో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహారం ఎంతో వృథా అయిందని ఈ నష్టానికి ఎవరు బాధ్యులని మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. మండలంలో 38 అంగన్వాడీ భవనాల మరమ్మతులకు అంచనాలు పంపించామని చేసిన పనుల ఆధారంగా నిధులు మంజూరవుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పేర్కొన్నారు. వెలుగు ఏపీఎం ఆర్.గంగాధర్ మాట్లాడుతూ మండలంలో ఆసరా నిధులు రూ.9 కోట్లకు రూ.7 కోట్లు మాత్రమే మంజూరయ్యాయని మిగిలిన మొత్తం ప్రభుత్వం నుంచి వచ్చిన వెంటనే మిగిలిన 284 సంఘాల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, తహసీల్దార్ జె.విమల కుమారి, ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.మమత, ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



సిరిపల్లిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు, కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారమవుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం సిరిపల్లి సర్పంచ్ కుడుపూడి శాంతావతి ఆధ్వర్యంలో విప్పర్తి వేణుగోపాలరావు, కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా 150 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. వేణుగోపాలరావు, చిట్టిబాబు మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. మరలా రాష్ట్రంలో ఆయన్నే గెలిపించాలని అన్నారు. అనంతరం అయినవిల్లిలో రూ.86 లక్షలతో నిర్మించిన బైపాస్ రోడ్డును ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమద్వర, పార్టీ మండల కన్వీనర్ కుడుపూడి విద్యాసాగర్, అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల కిరణ్, కుసుమ లిల్లీ మంగేష్కర్, మట్టపర్తి వెంకటరమణ, కామన కృష్ణమూర్తి, రావూరి బుజ్జి, వీఆర్వో సుమ తదితరులు ఉన్నారు.

అప్యాయంగా పలకరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..



మూలస్థాన అగ్రహారంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి పారదర్శకతే ప్రామాణికంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని వివరిస్తూ ప్రజలందరిని ఆప్యాయతతో పలకరిస్తూ, గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తూ మండలంలోని మూలస్థాన అగ్రహారం-1 గ్రామ సచివాలయం పరిధిలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, పార్టీ నేత కోనాల పేర్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన, అమలుచేసిన అన్ని పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. ఇల్లు లేని నిరుపేదలందరికి ఇళ్ల స్థలాలు అందించిన సంగతిని ఆయన గుర్తు చేశారు. పేదల అభ్యున్నతికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, దియ్యన పెదకాపు, నాగిరెడ్డి గంగారావు, తోట కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జనరంజకంగా సీఎం జగన్ పాలన



వైఎస్సార్ సీపీ నేత సత్తిబాబురాజుకు శాలువా కప్పుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకమైన పాలన అందిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ నేతలను ఆయన బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గోగన్నమఠానికి చెందిన భూపతిరాజు సత్తిబాబురాజును, మగటపల్లికి చెందిన సూరిశెట్టి బాబి, సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ సూరిశెట్టి చంటిబాబుతో పాటు గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలను కలిశారు. సూర్యారావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పథకంలో నడిపిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పాలనను కొత్త పుంతలు తొక్కిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. జగన్ పాలనపై ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని, రెండోసారి ముఖ్యమంత్రిని చేసే అవకాశం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని సూర్యారావు పేర్కొన్నారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో ఎక్కడా మాట తప్పలేదు, మడమ తిప్పని నేతగా సీఎం జగన్ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఉద్ఘాటించారు.

మంచినీటి ట్యాంకుల క్లీనింగ్



మలికిపురంలో తాగునీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

మలికిపురం: మండలంలోని వివిధ గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను బుధవారం సామూహికంగా క్లీనింగ్ నిర్వహించారు. మండలంలోని మొత్తం 62 ఓహెచ్ఆర్ ట్యాంకులను 119 పంచాయతీ సిబ్బంది ద్వారా శుద్ధి చేయించినట్లు ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు తెలిపారు. జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన వివరించారు. తహసీల్దార్ జి.అనిత కుమారి స్థానిక పంచాయతీ అధికారులు పర్యవేక్షించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామాల్లో 38 మంచినీటి ట్యాంకులను ఆ గ్రామాల పంచాయతీ అధికారులు బుధవారం శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమాన్ని డ్వామా పీడీ మధుసూదనరావు, మండల ప్రత్యేక అధికారి వై.సత్యనారాయణ, ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, తహసీల్దార్ ప్రమద్వర, ఈఓపీఆర్డీ కేవీఎస్ మోహన్‌కృష్ణలు పర్యవేక్షించారు.

57 తాగునీటి ట్యాంకులు శుభ్రం చేసే పనులు పూర్తి

సఖినేటిపల్లి: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లోని 69 తాగునీటి ట్యాంకులకు గాను 57 ట్యాంకులను శుభ్రం చేసే పనులు పూర్తయినట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో బడుగు మంగాదేవి బుధవారం తెలిపారు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీసీలో జిల్లాలోని అన్ని ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లను అన్ని గ్రామ పంచాయతీల్లో శుభ్రపరచాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారని ఆమె చెప్పారు. ఈ మేరకు కలెక్టర్‌కు పంపిన నివేదికలో ఈ కింది విషయాలు పేర్కొన్నట్టు ఆమె అన్నారు. ఇంకనూ మిగిలిన 12 ట్యాంకుల్లో 3 ట్యాంకులు అంతర్వేది దేవస్థానంలో శిథిల స్థితికి చేరుకున్నాయని, సఖినేటిపల్లిలంక లో 3 ట్యాంకులు సీపీడబ్ల్యూఎస్ స్కీం మెయిన్ లైన్ పైపు లైనులు డామేజ్ అవడం వల్ల ఈ ట్యాంకులు శుభ్రపరుచుటకు అంతరాయం కలిగిందన్నారు. వీటితో పాటు రామేశ్వరంలో 1, గొందిలో 3, గుడిమూలలో 2 ట్యాంకులు మొత్తం 6 కొత్త ట్యాంకులకు పైపులైన్లు అనుసంధానం, ఇతర ఫినిషింగ్ పనులు పూర్తి కాకపోవడంతో ఇవి కూడా శుభ్రపరిచే పనులు వీలు పడలేదని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రావులపాలెం: స్థానిక అమలాపురం రోడ్డులోని పెంకులపాటి గురువు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనగా ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన గోదాసి శివరామ ఫణీంద్రకుమార్ (33) సామర్లకోటలోని ఒక ఫ్యాక్టరీలో పని ముగించుకుని మాచవరం వెళుతుండగా ఎదురుగా రావులపాలెం వైపు వస్తున్న మరో బైక్‌పై మండపల్లికి చెందిన కల్యాణం ఏసు, కల్యాణం సాయి ఢీకొట్టడంతో రోడ్డుపై పడి కుమార్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఆసుపత్రికి తరలించారు. అలాగే మరో బైక్‌పై ఉన్న ఏసు, సాయిలకు తీవ్రగాయాలు కావడంతో వారిని రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.